క్లుప్తంగా

సన్మానం



దేవరుప్పుల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాలకుర్తి కేంద్రంలో చిన్నమడూరుకు చెందిన ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షురాలు గొడుగు సుజాతను పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హయాంలో మహిళా సాధికారత దిశలో అన్ని రంగాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు.

తహసీల్దార్‌కు..

బచ్చన్నపేట: నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ గంగాభవానిని బీజేపీ మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి శాలువాతో సన్మానించారు. మంగళవారం తహసీల్‌లో ఆమెను కలిసి పలు విషయాలు చర్చించారు. సీనియర్ నాయకులు పెండెం నాగేష్, బీజేవైఎం మండల అధ్యక్షుడు బంగారు మహేష్, ప్రధాన కార్యదర్శి గద్ద రాజు, నాయకులు రవిచారి, భాస్కర్ పాల్గొన్నారు.

కాపర్ వైర్ దొంగల ముఠా అరెస్ట్



బచ్చన్నపేట: మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్ వైరు ఎత్తుకెళ్తున్న దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు జనగామ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై నవీన్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనగామ క్రైం టీం, బచ్చన్నపేట పోలీసులు సంయుక్తంగా కలిసి దొంగల ముఠాను పట్టుకున్నారన్నారు. గజ్వేల్‌కు చెందిన పోల సిద్దయ్య, వనం నాగయ్య, వనం వెంకటయ్య, వనం నర్సింహులు, కండెల వెంకన్న వీరంతా ఒక ముఠాగా ఏర్పడి బచ్చన్నపేట, దేవరుప్పుల, లింగాలఘనపూర్, రఘునాథపల్లి ఏరియాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. దొంగలించిన 210 కిలోల కాపర్ వైరు విలువ సుమారు రూ.2.10 లక్షలు ఉంటుందన్నారు. ఇందులో 130 కిలోల కాపర్ వైరును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పోల సిద్దయ్య, వనం నాగయ్యలు పరారీలు ఉండగా మిగతా ముగ్గురిని రిమాండ్‌కు తరలించామని, మిగతా వారిని త్వరలోనే పట్టుకుంటామన్నారు. ఈ ముఠాను పట్టుకున్న, ఎస్సై పోలీసులను అభినందించారు.

యువకుడి ఆత్మహత్య



శివమణి (ఫైల్)

తరిగొప్పుల: బీనసికస్థితి సరిగాలేక జీవితంపై విరక్తి చెంది యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని అక్కరాజుపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అక్కరాజుపల్లి గ్రామానికి చెందిన రేషన్ డీలర్ జొన్నగోని రాజు కుమారుడు జొన్నగోని శివమణి (20) గత కొంతకాలంగా మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో చికిత్స పొందుతూ మందులు వాడుతున్నాడని, అయినప్పటికీ నయంకాకపోవడం జీవితంపై విరక్తి చెంది మంగళవారం తెల్లవారు జామున ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పల్లగుట్టలో వ్యక్తి..



గట్టయ్య (ఫైల్)

చిల్పూరు: ఆర్థిక ఇబ్బందులతో మండలంలోని పల్లగుట్టకు చెందిన కన్నెబోయిన గట్టయ్య (58) మంగళవారం తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యులు, ఎస్సై వినయ్‌కుమార్ అందించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గట్టయ్య వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులకు తోడు, అనారోగ్య సమస్య తీవ్రం కావడంతో మంగళవారం క్రిమిసంహారక మందుతాగి పడిపోయాడు. చుట్టుపక్కల రైతులు గమనించి 108కి సమాచారం ఇచ్చారు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య దేవేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలి

ఖిలా వరంగల్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని పీవైఎల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి బండి కోటేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం గవిచర్లలో ప్రగతిశీల యువజన సంఘం, న్యూడెమోక్రసీ , ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

ప్రజల కష్టాల్లో పాలుపంచుకుంటా..

ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



రఘునాథపల్లి: నిడిగొండలో స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రాజయ్య

రఘునాథపల్లి: నియోజకవర్గ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, వారి కష్టాల్లో పాలుపంచుకుంటానని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిడిగొండలో ఆయన పల్లెనిద్ర చేసి మంగళవారం ఉదయాన్నే వీధుల్లో పర్యటిస్తూ, స్థానికుల సమస్యలు తెలుసుకుంటూ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికి గృహలక్ష్మి ఇళ్లు మంజూరు చేయడంతో పాటు గ్రామ గ్రామాన తాను వచ్చి ముగ్గు పోస్తానన్నారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.కుమార్‌గౌడ్, మండల అధ్యక్షుడు వారాల రమేష్, సర్పంచ్ బిర్రు లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ చీమలపాటి రవీందర్, తిప్పారపు రమ్యబాబురావు, మాల రాజు తదితరులు పాల్గొన్నారు.

పశుమిత్రలకు కనీస వేతనం ఇవ్వాలి

పశుమిత్రలకు కనీస వేతనం ఇవ్వాలని మండలానికి చెందిన పశుమిత్రలు ఎమ్మెల్యే రాజయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. పశుమిత్ర సంఘం జిల్లా కార్యదర్శి కె మంగ, సరళ, మంజుల, స్వప్న, శ్రావణి, మనీల, కోమల, అనూష, శ్రామల తదితరులు ఉన్నారు.

పల్లెల్లో ఎంతో ప్రగతి సాధించాం..

లింగాలఘణపురం: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం పల్లెల్లో ఎంతో అభివృద్ధి సాధించుకున్నామని ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. మంగళవారం మండలంలోని నాగారం, మంథోనిగూడెం, కళ్లెం, మాణిక్యాపురం, సిరిపురం గ్రామాల్లో ప్రగతి నివేదన యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. వీధివీధిన సీసీ రోడ్లు, ఇంటింటికి మిషన్ భగీరథ తాగునీరు, కాలువలతో సాగునీరు, ఉచిత విద్యుత్, రైతుబంధు, కల్యాణలక్ష్మి ఇలా ఎన్నో పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి సాధించుకుంటామని అన్నారు. ఎంపీపీ జయశ్రీ, జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపేందర్, ఆంజనేయులు, నాయకులు నాగేందర్, భాగ్యలక్ష్మి, శ్రీహరితోపాటు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయం

సీఎం కప్ క్రీడల్లో గెలుపొందిన జట్లకు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిట్ల ఉపేందర్‌రెడ్డి రూ.50వేల ఆర్థిక సహాయం అందించి క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. ఇటీవల నిర్వహించిన సీఎం కప్ క్రీడల్లో మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు ప్రోత్సాహకంగా ప్రకటించిన రూ.50వేలను మంగళవారం ఎంపీపీ చిట్ల జయశ్రీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఎంపీడీఓ మల్లికార్జున్, తహసీల్దార్ విజయలత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసు, పీఏసీఎస్ చైర్మన్ ఉపేందర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

చిల్పూరు: చిల్పూరు మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ కట్ట కొమురయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజయ్య బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఎంపీపీ సరితబాలరాజు, సర్పంచ్ రాజ్‌కుమార్, చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు జంగిటి కుమార్, కలకోల రజనీకుమార్, పంతం రాజ్‌కుమార్, నలిమెల రజిత తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



యూనిఫామ్స్ అందజేస్తున్న రాంచందర్

జనగామ రూరల్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని 16 వార్డు కౌన్సిలర్ గాదె పాక రాంచందర్ అన్నారు. పట్టణంలోని హరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రాంచందర్ చేతుల మీదుగా విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. హెచ్‌ఎం రాములు, విద్యారులు పాల్గొన్నారు.

క్రికెట్, వాలీబాల్ కిట్ల అందజేత



వాలీబాల్, క్రికెట్ కిట్లను అందజేస్తున్న బీరప్ప

తరిగొప్పుల: బేజాడి ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని జగ్గయ్యపేట, అక్కరాజుపల్లిలో యువతకు క్రికెట్ వాలీబాల్, కిట్లను ట్రస్ట్ వ్యవస్థాపకుడు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడీ బీరప్ప మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అప్పుడే దేశం ముందుకు వెళ్తుందని అన్నారు. క్రీడలు మానసిక ప్రశాంతతకు, దేహదారుఢ్యానికి దోహదపడుతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో జనగామ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ బల్ల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండ ప్రసాద్, యువమోర్చా జనగామ అసెంబ్లీ కన్వీనర్ ఈర్ల నవీన్, మండల బాధ్యులు పబ్బోజు రాంబ్రహ్మాచారి, తలకొక్కుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘ఏం సాధించారని ఉత్సవాలు’

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణలో ప్రజలకు చేసిన హామీలు ఏమి నెరవేర్చారని, ఏం సాధించారని బీఆర్‌ఎస్ నేతలు రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ సంగాల యిర్మియా అన్నారు. డివిజన్ కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు ప్రజాధనాన్ని వృథా చేస్తూ ఉత్సవాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ ప్రజలకు చేసిన హామీలను నెరవేర్చనందుకా, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వనందుకా, దళిత బంధు ఇస్తానని రూ.3లక్షలు కమిషన్లు తీసుకున్నందుకా, రైతులకు రుణమాఫీ చేయనందుకా, నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం ఇవ్వనందుకా ఎందుకు ఈ ఉత్సవాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికలు సమీపిస్తుండగా మరోసారి ప్రజలను మభ్యపెట్టేందుకు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు.

పెళ్లికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సర్పంచ్ ఉమ

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ 12వ వార్డుకు చెందిన తల్లిదండ్రులు లేని నిరుపేద యువతి బండ మమత వివాహానికి సర్పంచ్ చల్లా ఉమాసుధీర్‌రెడ్డి రూ.5వేల ఆర్థికసాయం మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద అమ్మాయి వివాహానికి తమవంతుగా సహాయం చేసినట్లు తెలిపారు. వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, ఉపసర్పంచ్ మారపాక రాములు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు..

లింగాలఘణపురం: మండలంలోని చీటూరులో మబ్బు ముత్తయ్య, గోదారి బాలనర్సమ్మ మృతి చెందగా పార్థివ దేహాలకు మంగళవారం జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఒక్కొక్క కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. బీఆర్‌ఎస్ నాయకులు నాగేందర్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గణపతి, మార్కెట్ డైరెక్టర్ ఆంజనేయులు, నాయకులు మధు, యాదయ్య, మల్లేశం, ఉపేందర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజా సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం’

జఫర్‌గఢ్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరుతో కేసీఆర్ ప్రభుత్వం ప్రజా సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనాన్ని పూర్తిగా దుర్వినియోగం చేస్తుందన్నారు. సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా కొత్త హామీలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పూర్తిగా ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నాయన్నారు. ఈ విధానాలను ఎండగట్టాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు పెండ్యాల సమ్మయ్య, రడపాక యాదగిరి, మునలయ్య, ఎండి యాకుబ్‌పాష, అన్నెపు అజయ్, ఎండి జాఫర్ పాల్గొన్నారు.

నేడు పాలిటెక్నిక్‌లో ప్రవేశాలపై అవగాహన సదస్సు

స్టేషన్‌ఘన్‌పూర్: పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పోచయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంకేతిక విద్యాశాఖ పాలిటెక్నిక్ విద్యలో ప్రవేశాలపై దృష్టి సారించిందని, ఈ నేపథ్యంలో స్థానిక కళాశాలలో నేడు ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీఎస్ పాలిసెట్–2023 ఫలితాల ఆధారంగా ప్రవేశాల కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నారని, మొదటి విడత కౌన్సిలింగ్ ఈనెల 14 నుంచి 18వ తేదీవరకు ఉంటుందని ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం ఉందన్నారు. ప్రవేశాల కోసం రుసుము చెల్లింపు, స్లాట్ బుకింగ్ తదితర అంశాలు ఉంటాయని, అవగాహన సదస్సుకు టీఎస్ పాలిసెట్–2023 పరీక్షకు హాజరైన జిల్లాలోని విద్యార్థులు, పేరెంట్స్ రాగలన్నారు.

ప్రతిభావంతుల గుర్తింపు

బచ్చన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మనో ధైర్యాన్ని కల్పించాలని అందులోని ప్రతిభావంతులను గుర్తించి సన్మానం చేస్తున్నామని రిలయన్స్ ట్రెండ్స్ సంస్థ బ్రాంచ్ సేల్స్‌మేనేజర్ దండు దయాకర్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల ప్రతిభావంతులను మంగళవారం సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో శాలువాలతో సన్మానించి మెమొంటోలు అందజేశారు.



సన్మానం పొందిన ప్రతిభావంతులు

నమ్మకానికి నజరానా..

● రెండున్నర దశాబ్దాల ఉద్యోగానికి దక్కిన ప్రతిఫలం



కార్మికుడు సతీష్ కొత్త ఇంట్లో గిఫ్టును అందజేస్తున్న వ్యాపారి మధు

జనగామ: రెండున్నర దశాబ్దాల నమ్మకానికి యజమాని నుంచి వచ్చిన ఆఫర్‌తో కార్మికుడి కుటుంబంలో సంతోషం వెల్లివిరిసింది. ఉద్యోగం పట్ల అంకిత భావం సొంతింటి కలను సాకారం చేసింది. జనగామకు చెందిన వస్త్ర వ్యాపారి గజ్జి మధు వద్ద పట్టణంలోని శివాలయం వీధిలో నివాసముంటే గాయకోటి సతీష్ 2000 సంవత్సరం నుంచి పని చేస్తున్నాడు. నెలకు రూ.30 వేల వేతనంతో పని చేస్తున్న సతీష్ ఇటీవల హైదరాబాద్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన బ్రాంచ్‌కు వెళ్లాడు కేవలం ప్రతి నెల వచ్చే వేతనంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న సతీష్‌కు సొంత ఇల్లు కొనాలనే ఆశ, ఆకాంక్ష ఉండేది. ఈ విషయన్ని గమనించిన వ్యాపారి మధు బోడుప్పల్ ఏరియాలో డబుల్ బెడ్రూం ఇల్లు కొనుగోలు చేశారు. రూ.26 లక్షల విలువ చేసే ఇంటి కోసం వ్యాపారి సొంతంగా రూ.12 లక్షలు కార్మికుడు సతీష్‌కు ఇవ్వగా, మిగతా డబ్బులను బ్యాంకు రుణం ద్వారా ఇప్పించాడు. వ్యాపారి ఔదార్యానికి సతీష్ ఫిదా అయిపోయి నిండు హృదయంతో ఆశీర్వదించారు. ప్రస్తుత సమాజంలో రూపాయిని సైతం లెక్కించే మనుషులు ఉండగా ఏకంగా ఇంటి నిర్మాణం కోసం రూ.12 లక్షలు అందించి అంకిత భావానికి గుర్తింపు నిచ్చిన వ్యాపారిపై ప్రశంసల జల్లులు కురుస్తున్నాయి.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న పాత్రికేయులు

బచ్చన్నపేట: మండల కేంద్రంలో కొన్ని ఏళ్లుగా వివిధ దినపత్రికల్లో పని చేస్తున్న ప్రభుత్వ గుర్తింపు పొందిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తేలుకంటి మురళి కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ గంగా భవానికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రికేయ రంగంలో 30 ఏళ్లకు పై బడి పని చేస్తున్నామని అందరూ అక్రిడేషన్ కార్డులను కలిగి ఉన్నామని అన్నారు. ఇట్టి విషయాన్ని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లతామని తెలిపారు.

నూతన క్లబ్‌కు సన్మానం..

నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ సభ్యులను జనగామ ఏసీపీ దేవేందర్‌రెడ్డి స్థానిక పోలీస్ స్టేషన్‌లో శాలువాలతో సన్మానించారు. ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కవితకు అభినందనలు



రఘునాథపల్లి: నిబద్ధతతో విధులు నిర్వహిస్తోన్న రఘునాథపల్లి మహిళా కానిస్టేబుల్ బి.కవిత సేవలను గుర్తిస్తూ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఏసీపీ డి రఘుచందర్, ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఆర్డీఓ కృష్ణవేణి, సీడీపీఓ ఫ్లోరెన్స్ మెమొంటోతో సత్కరించారు. మంగళవారం స్టేషన్ ఘన్‌పూర్‌లో జరిగిన మహిళా సంక్షేమ దినోత్సవాన్ని పురష్కరించుకొని రఘునాథపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కవితను సత్కరించి అభినందించారు.

‘కంటి వెలుగు’పై అవగాహన కల్పించాలి



కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజల అంధత్వ నివారణకు ఊరూరా కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేస్తున్నదని దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని సాల్వాపూర్‌లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ శిబిరంలో ఉచిత కంటి పరీక్షలతో పాటు అద్దాలను కూడా అందించడం జరుగుతుందన్నారు. అవసరం ఉన్న వారందరూ వినియోగించుకోవాలని తెలిపారు. గ్రామ సర్పంచ్ కీసర లక్ష్మి, ఎంపీటీసీ గూడెపు లతశ్రీ, వైద్యులు రమ్య, ఆప్తాల్మిక్ ప్రవీణ్ సిబ్బంది హబీబ్, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను సన్మానిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

బచ్చన్నపేట: ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని బాండీ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు చల్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల 5వ నేషనల్ ఫెడరేషన్ కప్ పోటీల్లో గుజరాత్‌పై స్వర్ణం గెలిచిన బాలికలను, పూణెపై రజతం గెలిచిన బాలురను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ చైర్మన్ ఆంజనేయులుగౌడ్, కోచ్ నసీరొద్దీన్, మేనేజర్ హేమలతో కలిసి హైదరాబాద్‌లో సన్మానించామన్నారు. క్రీడలతో దేశ పేరు ప్రఖ్యాతులు ఖండ ఖండాంతరాలకు వ్యాపిస్తాయన్నారు.

కనకదుర్గ అమ్మవారికి అభిషేక పూజలు



పూజలో జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండలో ఇటీవల నిర్మించిన శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన చేసి 41 రోజులు పూర్తయిన సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలను మంగళవారం చేపట్టారు. అర్చకులు, పూజారుల మంత్రోచ్ఛరణల మధ్య మొదట గణపతి పూజ, పుణ్యహవాచనం, రక్షాబంధనం, కుంభారాధన, మూలమంత్ర హవనం, శ్రీయాగం, మహాపూర్ణాహుతి పూజలు చేపట్టారు. అనంతరం అమ్మవారికి జెడ్పీటీసీ మారపాక రవి, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, సర్పంచ్ చల్లా ఉమాసుధీర్‌రెడ్డి ఘటాభిషేకం, అలంకరణ, అర్చన, మహానైవేద్యం తదితర ప్రత్యేక పూజలను చేపట్టారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మారపాక రాములు, వార్డు సభ్యులు, అమ్మవారి ఆలయ ధర్మకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా..



జఫర్‌గఢ్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి తదితరులు

జఫర్‌గఢ్: బాధిత కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉంటానని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి పేర్కొన్నారు. మండలంలోని తిమ్మాపూర్, కూనూర్‌లో ఇటీవల మృతి చెందిన సాంబరాజు రవి, గోలి శోభ ఇళ్లకు కడియం మంగళవారం వెళ్లి వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అన్నివిధాలా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్ రావు, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల వెంకటస్వామి, పార్టీ జిల్లా నాయకులు బానోత్ రాజేష్‌నాయక్, కుల్లా మోహన్‌రావు, గాదెపాక సుధాకర్ బాబు, మారపల్లి ప్రభాకర్, గండి రమేష్ తదితరులు ఉన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

రఘునాథపల్లి: మండలంలోని కోమళ్ల గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంగళవారం గ్రామ పెద్దలు ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని కలిసి వినతి పత్రం అందజేశారు. మాజీ జెడ్పీటీసీ మారుజోడు రాంబాబుతో కలిసి హనుమకొండలో కడియంను కలిసి గ్రామ సమస్యలు వివరించారు. తమ విన్నపానికి కడియం సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. కడియం శ్రీహరిని కలిసిన వారిలో మాజీ సర్పంచ్ బండి యాదగిరిగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు తాటికొండ వెంకటేష్‌యాదవ్, బంద కుమారస్వామి, తీరబోయిన రవియాదవ్ తదితరులు ఉన్నారు.

పరామర్శ

చిల్పూరు: మండలంలోని వెంకటాద్రిపేట సర్పంచ్ కందుల రఘుపతి తండ్రి వెంకటస్వామి (60) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఏళ్లుగా గ్రామంలో డీలర్‌గా పనిచేస్తున్నాడు. అతని మృతి పట్ల ఎంపీటీసీ ఎన్నకూస కుమార్, పంచాయతీ కార్యదర్శి పిట్టల బాబు, డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు మల్లయ్య, జిల్లా కార్యదర్శి జయపాల్‌రెడ్డి తదితరులు సంతాపం తెలిపి సర్పంచ్‌ను పరామర్శించారు.

చిల్పూరులో..

చిల్పూరు మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ కట్ట కొమురయ్య (60) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఇమ్మానియేల్, శోభ, ఊమ్లానాయక్, సురేష్, మహేందర్, యాదిరెడ్డి ఉన్నారు.

ఆటో బోల్తాపడి మహిళ మృతి

బచ్చన్నపేట : ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడి మహిళ మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బండనాగారం గ్రామానికి చెందిన పలువురు మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చి తిరుగు ప్రయాణంలో కొడవటూర్‌కు చెందిన చెట్టి సిద్దులు ఆటో ఎక్కారు. ఆటో బచ్చన్నపేట నుంచి బసిరెడ్డిపల్లి మీదుగా బండనాగారం వెళ్తుండగా కిలోమీటరు దూరం వెళ్లగానే ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న పాము అండాలు (55) అక్కడికక్కడే మృతి చెందగా పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి ఎస్సై నవీన్‌కుమార్ చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, అండాలు మృతితో బండనాగారం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతురాలికి భర్త మల్లయ్య, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు.